

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎస్ఎస్ నాయుడు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో తిరుపతి జిల్లావాసులకు నలుగురికి చోటు దక్కింది. యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ విద్యా వైజ్ఞానిక మహాసభలు, కాకినాడలో జనవరి 5-8 తేదీల్లో వైభవంగా జరిగాయి. మొదటి రెండు రోజులు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 20వేల మంది ఉపాధ్యాయులతోనూ, తరువాత రెండురోజులు 2,200 మంది ప్రతినిధులతోనూ ఉపాధ్యాయుల సమస్యలపై మేధోమథనం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, జీవో 117 రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితంచేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రధాన తీర్మానాలను చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎస్ఎస్ నాయుడు (పుత్తూరు), కార్యవర్గ సభ్యులుగా ముత్యాలరెడ్డి (తిరుపతి), జిజె రాజశేఖర్ (సూళ్లూరుపేట), దేవరాల నిర్మల (తిరుపతి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'వైకుంఠుని' చెంత... మృత్యుఘోష

- ఆరుగురు భక్తులు దుర్మరణం
- 50 మందికి పైనే అస్వస్థత
- నేడు తిరుపతికి రానున్న చంద్రబాబు
- తక్షణమే టోకెన్ల జారీకి టిటిడి నిర్ణయం
- ఏర్పాట్ల లోపంపై మండిపడ్డ భక్తులు
- రూ.కోటి చొప్పన పరిహారం ఇవ్వాలన్న సిపిఎం

తొక్కిసలాటలో మృతిచెందిన వారిలో రజిని (47), శాంతి (40), మల్లిక (50), రాజేశ్వరి, నాయుడుబాబు (41),లావణ్య (37) ఉన్నారు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి : వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

తొక్కిసలాట ఘటనపై సమగ్ర విచారణ జరపాలి. ఆరుగురు మృతిచెందడంపై సిపిఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. టోకెన్ల జారీ కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేయడంలో టిటిడి వైఫల్యం వల్లే భక్తుల మృతికి కారణమయ్యింది. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి. కుటుంబంలో ఒకరికి టిటిడిలో పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలి.

40 మందికి గాయాలు : కలెక్టర్

తొక్కిసలాటలో 40 మంది గాయపడ్డారని, 28 మందిని రుయాకు, 12 మందిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. రుయాలో చికిత్స పందుతున్న 28 మందిలో నలుగురు మృతిచెందారు. స్విమ్స్‌లో ఇద్దరు మృతిచెందారు. మృతిచెందిన వారిలో ఐదుగురు మహిళలు, ఒకరు పురుషుడు ఉన్నారు. ఇరువురిని మాత్రమే గుర్తించడం జరిగింది.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుమల, తిరుపతి సిటి

'వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటే పుణ్యం వస్తుంది' అన్న భక్తుల సెంటిమెంట్.. టిటిడి యాజమాన్య నిర్లక్ష్య ధోరణితో ఆరుగురు భక్తుల దుర్మరణానికి కారణమయ్యింది.. సేలంకు చెందిన మల్లిక (52), నర్సీపట్నంకు చెందిన నాయుడుబాబు (50) మృతిచెందారని మాత్రమే ప్రస్తుతానికి సమాచారం. మృతుల్లో ఐదుగురు మహిళలు కాగా, ఒకరు పురుషులు ఉన్నారు. తిరుపతిలో పక్కా ప్రణాళికతో ఎనిమిది కౌంటర్లను వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కోసం ఏర్పాటు చేశామని టిటిడి చెబుతున్నా సౌకర్యాల లేమి, రద్దీ నియంత్రణ లేకపోవడంతో క్యూలైన్లలో తొక్కిసలాట చోటు చేసుకుంది. బుధవారం రాత్రి 9 గంటల పైన తిరుపతి అంతా గందరగోళంగా మారింది. క్యూలైన్లలో అస్వస్థతకు గురైన వారిని 'కుయ్ కుయ్'మంటూ అంబులెన్స్‌ల్లో తరలించారు. దాదాపు 50 మందిపైనే తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని స్విమ్స్, రుయాలకు తరలించి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే టిటిడి ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు, ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాస్ రుయాకు చేరుకుని అస్వస్థతకు గురైన వారికి మెరుగైన చికిత్స అందించే ప్రయత్నం చేశారు. సిఎం చంద్రబాబునాయుడు, ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఈ ఘటనలపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ఫోన్‌లో అధికారులను ఆరా తీస్తూ, బుధవారం బాధితులను పరామర్శించేందుకు రానున్నట్లు వెల్లడించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. తక్షణమే టోకెన్ల జారీకి టిటిడి అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో టోకెన్ల జారీ ప్రారంభించామని టిటిడి ఈవో తెలిపారు. రద్దీని అదుపు చేసేందుకు అధికారులు శ్రమిస్తున్నారు. అన్ని కేంద్రాల వద్దకు అదనపు బలగాలను తరలించారు. . సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, నాయకులు వేణు, బుజ్జి తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్నారు. ఘటన పునరావృతం కాకుండా యుద్ధప్రాతిపదికన భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని, అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.టోకెన్ల జారీ కేంద్రంలో సిబ్బంది ఒకరు అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించేందుకు క్యూలైన్లు తెరిచారు. టోకెన్లు జారీ చేసేందుకు క్యూలైన్లు ఓపెన్ చేశారని భక్తులు దూసుకురావడంతో తొక్కిసలాట జరిగినట్లు సమాచారం.

ప్రభుత్వ వైఫల్యం వల్లే తొక్కిసలాట : భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఎ

చిత్తశుద్ధి లేని వ్యక్తులకు, వివాదాస్పద వ్యక్తులకు టిటిడి పగ్గాలు ఇచ్చారని, టిటిడిని రాజకీయ కేంద్రంగా మార్చారని, భక్తుల ప్రయోజనాలకు గాలికి వదిలేశారని మాజీ ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. తొక్కిసలాట ఘటనలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. గడిచిన ఐదేళ్లలో ఎపుడూ ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. టిటిడి చరిత్రలో ఇది చీకటి రోజన్నారు.

ఏర్పాట్లు శూన్యం : లక్ష్మణరావు, కాకినాడ

పత్రికల్లో, మీడియాలో టిటిడి ఊదరగొట్టింది. తిరుమల రావద్దు.. తిరుపతిలో 8చోట్ల కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం తీసుకోమని చెప్పింది. ఎంఆర్‌పల్లి, జీవకోన, అలిపిరి వద్ద భక్తులు ఉండడంతో బైరాగిపట్టెడ రామానాయుడు స్కూలు వద్దకు వచ్చాం. అప్పటికే రష్ ఎక్కువగా ఉంది. స్థానికులతో పాటు నాన్‌లోకల్ వాళ్లం కలిసిపోయాం. టిటిడి భక్తుల కోసం కాఫీ, టీ, మజ్జిగ, పాలు, అన్నప్రసాదాలు పెడుతుందని అనుకున్నాం. ఏమీ పెట్టలేదు. లోపల మమ్మల్ని వేసేసి బయటకు పోనీకుండా చేశారు. ఉక్కపోత. దర్శనం వద్దనుకుని బయటకు వెళ్లాలనుకున్నా పంపించలేదు. ఈ ఘటన జరిగిన తరువాత ప్రశాంతత లేదు. రాత్రి 10కల్లా క్లోజ్ అని చెబుతున్నారు. ఇంత దూరం నుంచి వచ్చి శ్రీవారిని దర్శించుకోకపోతే వెలితిగా ఉంటుంది.

ఉదయం అనగా వచ్చాం : మాలతి,తాడిపత్రి, అనంతపురం జిల్లా

ఉదయం అనగా వచ్చాం. రాత్రంతా ప్రయాణం చేసి అలిసిపోయాం. అయినా స్వామిపైన భక్తితో శ్రీవారిని చూసుకోవాలని క్యూలైన్లలో వేచి ఉన్నాం. అయితే క్యూలైన్లలో ఏర్పాట్లు సరిగ్గా లేవు. పోలీసులు కసురుకుంటున్నారు. వైకుంఠ ఏకాదశి రోజు శ్రీవారిని దర్శించుకుంటే మంచి జరుగుతుందన్న నమ్మకంతో ఏడుగురం ఆధార్ కార్డులతో సహా క్యూలైన్లలో నిలబడ్డాం. తొక్కిసలాట, ఉక్కపోత ఉంది. చలికాలంలో ఉక్కపోత ఏంటా? అని అనుకున్నాం.ఆరుగురు చనిపోయాక ఫ్రీగా ఇప్పుడు వదులుతున్నారు.

భూ అర్జీలు..కోకొల్లలు..!

- తిరుపతిలో సగం '22ఎ' భూములే..
- పూర్తిగా కొలిక్కిరాని శెట్టిపల్లి సమస్య
- మఠం భూములకు పరిష్కారం ఏది?
- రెవెన్యూ'కు సవాలుగా సమస్యలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఏళ్ల తరబడి వివిధ పేచీలతో కొనసాగుతున్న భూ వివాదాల పరిష్కారం రెవెన్యూ విభాగానికి సవాల్ మారింది. పరిష్కారం ఏంటన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. రెవెన్యూ శాఖ ప్రస్తుత పనితీరుపై ఆ శాఖ ఉన్నతాధికారులే అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 'రెవెన్యూ' సమస్యలే అధికంగా వస్తుంటాయి. ప్రస్తుతం తిరిగి రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలను స్వీకరించడం అధికారులకు తలనొప్పిగానే మారింది. పరిష్కరించకపోతే అటు ప్రభుత్వంతోనూ, ఇటు ప్రజలతోనూ ఇబ్బందే. ఒకవేళ పరిష్కరించాలని చూస్తే సమస్యలు 'కోకొల్లలు'. ఎక్కువభాగం కిందిస్థాయి సిబ్బంది సమస్యలను చేతబట్టుకుని, అర్జీదారుల ఇళ్లకు వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరించకనే పరిష్కరించేసినట్లుగా సంతకాలు తీసుకుని, ఉన్నతాధికారులకు పంపించేస్తుండటం గమనార్హం.

తిరుపతి జిల్లాలో సగం భూములు 22 ఏ కింద ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఈ భూములు రిజిస్ట్రేషన్ కాకుండా ఉన్నాయి. వాటితోపాటు హథీరాం బావాజీ భూములు ఉన్నాయి. ఇవి కూడా రిజిస్ట్రేషన్‌కు నోచుకోవడం లేదు. ఈ స్థలాలు చాలా వరకు కబ్జాల చెరలో ఉన్నాయి. శెట్టిపల్లి భూముల పరిష్కారానికి సరైన దారి చూపడం లేదు అదిగో ఇదిగో అంటూ ప్రజలను మోసం చేయడం తప్ప శాశ్వత పరిష్కారం లభించడం లేదు. రెవెన్యూ సదస్సుల్లో తిరుపతి అర్బన్ మండలం పరిధిలో సుమారు 200 అర్జీలు వచ్చాయి. ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు. దీన్నిబట్టి తెలుస్తుంది రెవెన్యూ సదస్సులు ఏమాత్రంగా ప్రజలకు ఉపయోగపడ్డాయో అనేది. రెండు నెలల క్రితం తిరుపతి పర్యటనకు వచ్చిన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ భూ సమస్యలపై రీజినల్ స్థాయి సదస్సు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్లు హాజరయ్యారు. ఎమ్మెల్యేలూ పాల్గొని భూ సమస్యలపై వివరిం చారు. ఇక భూ వివాదాల్లో కీలకమైన 22ఏ కింద ఉన్న భూములపైనే తీవ్రంగా చర్చ సాగింది. వీటిని ఎలా పరిష్కరించాలనే దానిపై దష్టి సారించాలని రెవెన్యూ మంత్రి అధికారులను ఆదేశించారు. ముందుగా నిషేధిత భూముల వివరాలు నివేదించాలని కోరారు. నిషేధిత భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? ప్రైవేటు భూమి ఎంత? దేవాదాయ భూమి ఎంత? వక్ఫ్‌బోర్డు ఎంత? వివాదాల్లో ఉన్న భూమి ఎంతనేది మూడు రోజుల్లో నివేదికలు ఇవ్వాలని జేసీలను ఆదేశించారు. దీంతో ఇప్పుడు భూముల వివరాలు సేకరించే పనిలో యంత్రాంగం ఉంది. సర్వే నెంబర్లు తప్పిదాలు, ప్రభుత్వ భూమిలో ఒకరిద్దరికీ ఇచ్చి మిగతా భూమి ఖాళీగా పట్టాలు ఉండటం, ఇనాంభూములు, దేవాదాయశాఖ భూముల్లో నివాసాలు ఉండటం, చట్టాలకు విరుద్ధంగా పట్టాలు పొందడం, ఇలా పలు కారణాలతో వివాదం ఉన్న భూములను గత ప్రభుత్వ హయాంలో నిషేధిత భూముల జాబితాలో పెట్టారు. వీటిని '22ఏ' జాబితాగా నమోదు చేశారు. దీంతో ఈ భూముల యజమానులు అమ్ముకోవాలన్నా, ఇతర అవసరాల కోసం వినియోగించుకోవాలన్నా రికార్డుల్లో 22ఏ కింద చూపుతోంది. దీనిపై అధికారులకు అర్జీలు ఇస్తున్నారు. తీసేయాలంటే గ్రామస్థాయి నుంచీ కలెక్టర్ వరకూ ఫైల్ నడవాలి. కారణం చూపాలి. ఇందులో ప్రైవేటు పట్టాల భూములు కూడా ఇరుక్కున్నాయి. స్పష్టంగా ఫైలు కలెక్టర్ వరకూ రావాలి. ఇక్కడ అప్రూవల్ ఇస్తే నిషేధం తొలగుతుంది. ఈ ఫైళ్లు కింద నుంచి పైకి రావడం లేదు. రెవెన్యూ అధికారులు నిషేధిత భూముల జోలికి పోవడం లేదు. గతంలోనే వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. యంత్రాంగం క్రియాశీలకంగా వ్యవహరించడం లేదు. దీంతో నిషేధిత భూముల సమస్య యథాతథంగా ఉంది. ఇప్పటికీ అర్జీలు ఇస్తూనే ఉన్నారు. తాజాగా మంత్రి అనగాని ప్రసాద్ వీటిపై దష్టి సారించారు. మూడు రోజుల్లో నివేదిక కోరారు. రాష్ట్రంలో 1.88 కోట్ల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నట్లు తేల్చారు. జిల్లాలోనూ లక్షలాది ఎకరాలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. వీటి వివరాలు తేలాల్సి ఉంది. ఇప్పటివరకూ అరకొర సమాచారమే ఉంది. ఇక ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లోనూ కుప్పలుతెప్పలుగా అర్జీలు భూసమస్యలపై వస్తున్నాయి. వాటి పరిష్కారం ఏమిటన్నదీ కనిపించడం లేదు. ఇప్పటివరకూ 20 వేలకు పైగానే వచ్చాయి.

'22 ఏ ' భూములు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి : భాగ్యలక్ష్మి, తిరుపతి అర్బన్ తహశీల్దార్

రెవెన్యూ సదస్సులో 22 ఏలో ఉన్న భూముల సమస్యల సంబంధించి అర్జీదారులు సదస్సుల్లో అర్జీలు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం.. తుదినిర్ణయం ప్రభుత్వానిదే. కొన్ని భూ సమస్యలను రెవెన్యూ సంస్థలోనే అప్పటికప్పుడే పరిష్కరించాం. వీలైనంత వరకూ తమ పరిధిలో వాటికి పరిష్కారాలు చూస్తాం.

భూసర్వే చేసి పాఠశాల సరిహద్దులు చూపండి

ప్రజాశక్తి - సత్యవేడు

రెవెన్యూ సదస్సులో చెన్నేరి పాఠశాల హెచ్‌ఎం లీలావతి



భూసర్వే చేసి పాఠశాల సరిహద్దులు చూపాలని తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చెన్నేరి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలావతి అధికారులకు విన్నవించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో గ్రామసర్పంచ్ రవిరెడ్డి అధ్యక్షతన చెన్నేరి, దాసుకుప్పం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి పార్లమెంట్ కార్యదర్శి లోకేష్ రెడ్డి, మునిరాజ, శేఖర్, వాసు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో పలు సమస్యలపై అధికారుల బందం ప్రజల నుంచి వినతులు స్వీకరించింది. సర్వే నెంబరు 159/బిలోని స్థలాన్ని సర్వే చేసి పాఠశాల సరిహద్దులు గుర్తించాలని సంబంధిత పాఠశాల హెచ్‌ఎం లీలావతి వినతి సమర్పించారు. హద్దులు నిర్ణయించకపోవడంతో పాఠశాలకు మంజూరైన ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టలేకపోయామన్నారు. అలాగే సర్వే నెంబరు 87 లో 50 సెంట్లు చొప్పున గతంలో సాగు భూమి పట్టాలు తీసుకున్న ఎస్సీ, ఎస్టీలలో కొందరు చనిపోవడం, మరికొందరు ఇక్కడ నివాసం లేకుండా వేరే ప్రాంతానికి తరలిపోయినట్టు చెన్నేరి గ్రామస్తుడు నాగరాజు అధికారుల బందానికి విన్నవించారు. వాటిని రద్దుచేసి అర్హులైన ఎస్సీ ఎస్టీలకు పట్టాలు ఇవ్వాలన్నారు. పొలాలు వద్దకు వెళ్లడానికి దారి సౌకర్యం కల్పించాలని రైతు కష్ణంరాజు విన్నవించారు. సర్వే నెంబరు 50/5, 2,3లో 0-64 సెంట్లు భూమికి సంబంధించి ఆన్లైన్లో నమోదు చేయాలని మహిళా రైతు శంకరమ్మ వినతి ఇచ్చారు. తమకు పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని మరో రైతు నంబూరు కళ విన్నవించారు. చెన్నేరి ప్రాథమిక పాఠశాల మెయిన్ రోడ్లో వేగ నిరోధకాలు ఏర్పాటుచేసి రోడ్డు ప్రమాదాలు నివారించాలని రిటైర్డ్ ఉపాధ్యాయులు బాలయ్య వినతి సమర్పించారు. తమకు వద్ధాప్య పింఛను మంజూరు చేయాలని మహిళా సంకరమ్మ విన్నవించారు. దాసుకుప్పంలో దళితవాడ, అరుంధతి వాడ, దాసుకుప్పం, గిరిజనవాడకు సంబంధించిన స్మశానాలను సమగ్రంగా భూసర్వే, సబ్ డివిజన్ చేసి రికార్డులో నమోదు చేయాలని గ్రామస్తులు లోకయ్య రెడ్డి అధికారులకు వినతి సమర్పించారు. కాగా గత నెల 7వ తేదీన ప్రారంభమైన రెవెన్యూ సదస్సు బుధవారంతో ముగిసింది. దాదాపు ఒక నెలపాటు అన్ని గ్రామాల్లో అధికారుల బందం రెవెన్యూ సదస్సు నిర్వహించి భూ సంబంధిత,ఇతర సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి వేణుగోపాల్, మండల సర్వేయర్ చంద్రశేఖర్, వీఆర్వో శేఖర్, సచివాలయ సర్వేయర్ రజిని, డిజిటల్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో నంబర్2ను సవరించి అందరికీ మినిమం టైంస్కేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. పశువైద్య విశ్వ విద్యాలయం ప్రధాన ఆర్చి ఎదుట ప్లకార్డులతో బుధవారం ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.చిన్నబాబు మాట్లాడుతూ ఈ జీవో వల్ల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మధ్య వేతనాల్లో తీవ్ర అసమానతలు ఏర్పడతాయన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక పోరాటాలతో ఉమ్మడి రాష్ట్రంలో సాధించుకున్న మినిమం టైంస్కేలుకు తిలోదకాలు ఇస్తూ గత ప్రభుత్వం జీవో 7ను తీసుకొచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం సైతం తామేమీ తీసిపోమంటూ అవే విధానాలను అవలంభిస్తూ జీవో 2 తీసుకొచ్చాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమం టైంస్కేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ యూనియన్ నాయకులు ముని రాజా, గంగయ్య, సుబాన్, బాబు, నందు, లక్ష్మీనారాయణ, వెంకట కష్ణయ్య, ఆలీ, నరేష్, ప్రసాద్, గణేష్, ప్రభాకర్ రెడ్డి శంకరయ్య, రమేష్, వరలక్ష్మి ,ముని లక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల హామీలు నెరవేర్చాలి: సిఐటియు

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు మండల గౌరవాధ్యక్షులు ఎస్.సాంబశివయ్య డిమాండ్‌చేశారు. సూళ్లూరుపేట సిఐటియు కార్యాలయంలో మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ సమావేశం బుధవారం జరిగింది. యూనియన్ అధ్యక్షులు చెంగయ్య మాట్లాడుతూ గత సంవత్సరం జరిగినటువంటి సమ్మెలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా కార్మికుల శాశ్వత నియమకాలు, సమాన పనికి సమాన వేతనం మొదలైనవి అమలు చేయాలని, అందులో భాగంగా ఈ నెల 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, సభ్యులు మునిరాజా, ఉపాధ్యక్షులు రామయ్య, సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి కె. లక్ష్మయ్య పాల్గొన్నారు.

ముచ్చటగా మూడు రోజులు ముగిసిన చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - కుప్పం టౌన్, రూరల్



కుప్పం నియోజకవర్గ పరిధిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల పర్యటన ముచ్చటగా ముగిసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి సోమ, మంగళ, బుధ వారాలలో కుప్పం నియోజకవర్గంలోని కుప్పం పట్టణం, మండల పరిధిలోని నడుమూరు, గుడుపల్లి మండల పరిధిలోని ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంతాలలో పర్యటించారు. సోమవారం పగలు 12 గంటల ప్రాంతంలో హెలికాప్టర్‌లో ద్రావిడ విశ్వవిద్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి, విశ్వవిద్యాలయ ఆడిటోరియం వేదికగా స్వర్ణ కుప్పం విజన్ 2029 ప్రణాళికలను ఆవిష్కరించారు. అనంతరం కుప్పం మండలం నడుమూరు గ్రామంలో సూర్య ఘర్ పథకాన్ని ప్రారంభించి, పట్టణ పరిధిలోని శీగలపల్లి ప్రాంతంలో ప్రకతి వ్యవసాయ రైతులను అభినందించి, వ్యవసాయ భూములను పరిశీలించి, ప్రకతి వ్యవసాయాన్ని అభివద్ధి చేయడానికి ఒప్పందాలు సైతం కుదుర్చుకున్నారు. ఆపై ద్రావిడ విశ్వవిద్యాలయం చేరుకుని స్థానిక టిడిపి నాయకులతో సమావేశం ముగించుకుని, కుప్పం పట్టణంలోని రోడ్డు, భవనాల శాఖ అతిథి గహానికి చేరుకోవడంతో మొదటి రోజు పర్యటన ముగిసింది. రెండవ రోజు పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం టిడిపి కార్యాలయానికి చేరుకుని స్థానిక ప్రజల సౌకర్యార్థం జననాయకుడు పోర్టల్ ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం చేరుకుని పలు అభివద్ధి కార్యక్రమాలకు, సంస్థల స్థాపనకు శంకుస్థాపనలు గావించారు.

అలాగే నిరుద్యోగ నిర్మూలనకు పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అక్కడి నుండి మండల పరిధిలోని కంగుంది గ్రామానికి చేరుకుని కీర్తిశేషులు శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం తిరిగి ద్రావిడ విశ్వవిద్యాలయానికి చేరుకుని పలు శాఖలకు సంబంధించిన ప్రభుత్వ అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. అలాగే విశ్వవిద్యాలయం పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన భవనాలను ప్రారంభించారు. రెండవ రోజు కార్యక్రమాలను ముగించుకున్న ముఖ్యమంత్రి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ చేరుకుని తీసుకున్నారు. బుధవారం ఉదయం పలువురు లబ్ధిదారులను కలుసుకుని, వారి అభినందనలను స్వీకరించి, ద్రావిడ విశ్వవిద్యాలయంలోని ఇందిరాగాంధీ స్టేడియం కు చేరుకుని, పలువురు టిడిపి నాయకులు, అభిమానుల వీడ్కోలుతో తిరుగు ప్రయాణమయ్యారు.

ద్రావిడ వర్సిటీలో నూతన భవనం ప్రారంభించిన సిఎం

ద్రావిడ విశ్వ విద్యాలయంలో 10 కోట్ల రూసా 2.0 నిధులతో నిర్మించిన అత్యాధునిక ల్యాబ్స్, సెమినార్ హాలు కలిగిన విద్యార్థి తరగతుల భవనాన్ని, రూ.2.5 కోట్లతో నిర్మించిన విద్యార్థుల వసతి గృహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం ప్రారంభించారు. కడా ఆధ్వర్యంలో గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. కుప్పంలోని యువతీ యువకులకు శిక్షణ ఇప్పించి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం స్కిల్ డెవలప్‌మెంట్ ఉద్దేశ్యం. ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్జీ ఇచ్చిన వెంటనే పరిష్కారం

సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన చలపతి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో మంగళవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వ్యవసాయ బోరుకు పంప్‌సెట్ కావాలని శాంతిపురం మండలం సోమాపురం గ్రామానికి చెందిన రైతు సి.చలపతి సిఎంకు అర్జీ ఇచ్చారు. సిఎం ఆదేశాల మేరకు అదేరోజు సాయంత్రం ఏడు గంటకల్లా ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులు రైతు పొలంలో వ్యవసాయ బోరుకు 10హెచ్‌పి /30 పంపుసెట్ ఏర్పాటు చేసి నీరు అందించారు. బుధవారం ఆర్ అండ్ బి అతిథిగృహంలో ముఖ్యమంత్రిని లబ్దిదారుడు చలపతి కలిసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'రూ. 80వేలు అప్పుచేసి పొలంలో బోరు వేశానని, డబ్బు సరిపోక పంప్‌సెట్ వేయించలేకపోయానని, పంట మొత్తం ఎండిపోయిందని, ఈనెల ఏడో తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కుప్పంలో అర్జీ సమర్పించగా, సిఎం ఆదేశాలతో అధికారులు అదేరోజు రాత్రి ఏడు గంటలకు పంపుసెట్ బిగించి పొలానికి నీరు అందించారని, నా ఆనందాన్ని అవధుల్లేవని, సిఎం చంద్రబాబు తనపాలిట దేవుడు' అని అభిమానాన్ని చాటుకున్నారు. సిఎం సమక్షంలో కుప్పం నియోజకవర్గ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సంతోష్‌కుమార్, వీరబ్రహ్మం మునిమనవడు వీరంభట్ల స్వామితో కలిసి కాలజ్ఞానం బోధించిన వీరబ్రహ్మం క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు.

ఘనంగా రాంకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కోట : సీనియర్ వైసీపీ నాయకులు వేమారెడ్డి షనీల్ కుమార్ రెడ్డి, దేవా రెడ్డి, నాగూర్ రెడ్డి ఆధ్వర్యంలో నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను కోట మండలంలోని గోడలు పంచాయతీ పరిధిలోని శివాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు హనుమంత రెడ్డి, భక్తవత్సల రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

కోట మండలం గూడలి పంచాయతీ పరిధిలో వైసీపీ యువ నాయకులు ఆములూరు నాగార్జున్ ఆధ్వర్యంలో నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి జన్మదిన సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి వద్ద పూజలు నిర్వహించి కేక్ ను కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం సీనియర్ వైసీపీ నాయకులు దేవారెడ్డి నాగూర్ రెడ్డి, వేమారెడ్డి షనీల్ కుమార్ రెడ్డిల చేతుల మీదుగా నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

హామీలు తక్షణమే అమలు చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి -కోట : రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోట మండల సిపిఎం నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని మోడీ వచ్చిన సందర్భంగా సిపిఎం కోట కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సిపిఎం నాయకులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలును ఒక్కటి అమలు చేయకపోవడం విడ్డూరంగా వుందన్నారు. లక్ష కోట్లు విలువ చేసే విశాఖ ఉక్కు అదాని, అంబానీకి ప్రవేటు పరం చేశారని దీంతోపాటు కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయిస్తామని గతంలో హామీ ఇచ్చి మరిచిపోయారన్నారు. వెంటనే హామీలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమణయ్య, నాగరాజు, బాలయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి చేయూత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రగతి సేవా సంస్థ ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు 1వ వార్డు శాంతి నగర్‌కు సంబంధించిన అంగన్‌వాడీ స్కూలు పిల్లల సౌకర్యార్థం సీలింగ్ ఫ్యాన్, కుక్కర్, గ్యాస్ స్టవ్, పిల్లలకు పలకలను మన ప్రగతి కుటుంబ సభ్యుడు పయ్యావుల మురళీ నాయుడు సహకారంతో బుధవారం అందించారు. సీడీపీవో మహబూబ్, సూపరువైజర్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్ మౌనికకు అందించారు.

తాగునీటి మోటారుకు మరమ్మతులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పీవీ కండ్రిగ పంచాయతీలోని కృష్ణాపురం గ్రామ పంచాయతీలో మూడు రోజులుగా మంచినీటి మోటారు స్టాటరు కాలిపోవడంతో గ్రామ ప్రజలు మంచినీటి కొరతతో ఇబ్బంది పడ్డారు. దీన్ని గమనించిన గ్రామ సర్పంచి యనమల వెంకటమ్మ కుమారుడు యనమల ప్రసాద్ పాల్ చొరవ తీసుకుని తన సొంత వ్యయంతో మరమ్మతులు చేయించి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

- విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ గూడూరు జోన్ మెన్ క్రికెట్ టోర్నమెంట్ 7వ తేదీ ప్రారంభమై, 8వ తేదీన ముగిసింది. ఎస్‌కెఆర్ డిగ్రీ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె నారాయణరాజు ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసిన టోర్నమెంట్ విజేతలకు బహుమతులు బుధవారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన యూరప్ లోని టిసిఎస్ హెడ్ సర్ఫరాజ్ చేవల పల్లి విజేతలను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి నారాయణ రాజు, సూళ్లూరుపేట డిగ్రీ కళాశాల పీడీ అమ్మాజీ, యూనివర్సిటీ అబ్జర్వర్ ఎం రవీంద్రబాబు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అందరూ విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శివప్రసాద్ మాట్లాడుతూ ఎస్‌కెఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల పోటీల్లో కూడా విజేతలుగా నిలవడం చాలా సంతోషమని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి నారాయణ రాజును అభినందించారు.

విజేతలకు క్రికెట్ కప్‌ను అందిస్తున్న నిర్వాహకులు

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - నాగలాపురం: బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీఓ బాలాజీ నాయక్ పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై కిశోర బాలికలకు ఐసిడిఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నాగలాపురం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఓ బాలయ్య, పిచ్చాటూరు సిడిపిఒ శోభారాణి, ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, ముని సుబ్రహ్మణ్యం, ఏపిఎం సీతారామయ్య పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఎంపీడీఓ బాలాజీ నాయక్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల మానసికంగా, శారీరక ఎదురయ్యే సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: మండల కేంద్రంలోని శ్రీ శక్తి కార్యాలయంలో చంద్రగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మండలంలోని అంగన్‌వాడీ సిబ్బందికి, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఏఎన్ఎంలకు కిశోర వికాసంపై బుధవారం శిక్షణ నిర్వహించారు. ఐసిడిఎస్ అధికారి ప్రదీప మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలకు కిశోర వికాసం ఎంత చాలా అవసరమని పిల్లలను మంచి పౌరులుగా తీర్చి దిద్దే బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. చిన్న వయసులోనే పిల్లలు సైబర్ క్రైమ్ బారిన పడి మత్తు పదార్థాలకు అలవాటు పడి వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సామాజిక రుగ్మతలు నుండి పిల్లల ఆలోచనలో అలవాట్లలో మార్పు తేవాలని ఎంపిడీవో అరుణ అన్నారు. యుక్త వయసు పిల్లలకు సామాజిక మార్పులను దూరంగా ఉంచి తన భవిష్యత్తును, తన కుటుంబాలను, సమాజానికి ఉపయోగపడే విధంగా ఆలోచనలు ఉండేలా తీర్చిదిద్దాలని ఎమ్మార్వో పరమేశ్వర స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఎంఇఓ, తదితరులు పాల్గొన్నారు.

యర్రావారిపాలెంలో శిక్షణ ఇస్తున్న అధికారులు

టిటిడి చైర్మన్‌ని కలిసిన నరసింహారెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుని చైర్మన్ కార్యాలయంలో బుధవారం కాంట్రాక్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ యం. నరసింహారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూచనలతో భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించడంలో తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. టిటిడి కాంట్రాక్టర్లు నాణ్యమైన రోడ్లు భవనాలు, కట్టడాలు, ఎక్కడ రాజీ లేకుండా నిర్మించాలని సూచించారు . ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు ఎం నరసింహారెడ్డి స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగం సూచనలతో భక్తులను దృష్టిలో పెట్టుకుని శ్రీవారి దగ్గరే గత 30 సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో పనులు చేస్తున్నామని, నాణ్యతలో రాజీ పడకుండా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దిలీప్ కుమార్ రెడ్డి, నరసింహా యాదవ్, తదితర కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పుత్తూరు రూరల్ మండలం, గొల్లపల్లి గ్రామ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరం తిరుపతికి చెందిన వాసన్ ఐ కేర్, 'మాధురి రెమిడి హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించారు. ముఖ్య అతిథులు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, వాకర్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ అసోషియేషన్ అధ్యక్షులు డాక్టరు రవిరాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి వైద్య సేవలు అందిస్తున్న ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వారికి సేవలు అభినందనీయం అన్నారు. గొల్లపల్లి పరిసర ప్రాంతాలలో ప్రజలు 500 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రంలో వాసన్ కు కేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టరు అలోక్ కుమార్, గుప్తా, పి ఆర్ ఓ. వెంకటేష్. మధురి రెమెడీ హాస్పిటల్ తిరుపతి వైద్యులు డాక్టరు ఆంజనేయులు, అభిషేక్, కళావతి. లోకేష్ లు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కోనేటి రవిరాజు, అధ్యక్షులు బాబు, కార్యదర్శు రామ్మోహన్ వర్మ, ఉపాధ్యక్షులు, చంద్రబాబు, సభ్యులు రామచంద్ర రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, బి. భారతి, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ గజపతి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ముఖ్య అతిథులను సన్మానిస్తున్న గొల్లపల్లి గ్రామస్తులు

ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కొలకత్తా ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ వారు మంగళవారం విడుదల చేసిన సీఎంఏ ఫౌండేషన్ ఫలితాలలో తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు 95.13 శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ప్రతిభను కనబరిచారని అకాడమీ డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ తెలిపారు. శ్రీకర్ 298, నందిని 284, అబ్దుల్ లతీఫ్ 282, పూర్ణిమ 282, హరీష్ 280, విజ్ఞయ 272, దీపిక 268 మార్కులను సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. ఉత్తమ మార్కులను విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించామన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్లు నాదముని, మునిరత్నం, జానీ, శీను, అధ్యాపకులు శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్చి' కూల్చివేత కారకులపై చర్యలు తీసుకోవాలి: కెవిపిఎస్

ప్రజాశక్తి-రేణిగుంట: తిరుపతి జిల్లా రేణిగుంట మండలం లోని వెదళ్లు చెరువు ఎస్టి కాలనీ 'సువార్త ప్రార్థన మందిరం చర్చి' కూల్చివేతకు కారకులపై రేణిగుంట పోలీస్ స్టేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు కోరారు. వెదళ్ల చెరువు క్రైస్తవ 15 కుటుంబాలకు, పాస్టర్ కు అగ్రవర్ణ పెత్తందారుడు చంద్రశేఖర్ రెడ్డి నుండి రక్షణ కల్పించాలని ఏపి గిరిజన సంఘం కొండ్రెడ్డి హరినాథ్, కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి కాంజేరి సెల్వరాజ్, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం మండల కార్యదర్శి కె. ఈశ్వరమ్మ బుధవారం ఓ ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో క్రిస్టియన్ బాధితుల ద్వారా ఫిర్యాదు చేశారని తెలిపారు.

అన్నా రామచంద్రయ్యపై విమర్శలు సరికాదు: రఫీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

తిరుపతి జీవకోనలో వేలాది మందికి భూ పోరాటాల ద్వారా స్థలాలు ఇప్పించిన వ్యక్తి అన్నా రామచంద్రయ్య యాదవ్‌పై వైసిపి నాయకులు వాసు యాదవ్ చేసిన విమర్శలు సరి కాదని, ఇకపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని రాజీవ్ నగర్ జీవకోన టిడిపి మాజీ అధ్యక్షులు రఫీ హిందుస్తానీ హెచ్చరించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులతో కలిసి రఫీ మాట్లాడారు. సత్యనారాయణపురం నుండి తిరుమల బైపాస్ రోడ్డును కలుపుతూ ఆగిపోయిన వంద మీటర్ల రోడ్డుకు ర్యాంపు వద్దని, రిజిష్టరు ల్యాండ్ కలిగి ఉన్న యాలమూరి శ్రీరాముల రెడ్డికి టిడిఆర్ బాండు ఇవ్వాలని, కోర్టులో స్టేను వెకేట్ చేయించుకొని పటిష్టమైన రోడ్డు నిర్మాణం చేపట్టాలని నగర పాలక సంస్థ అధికారులతో బాధిత ప్రజల తరపున అన్నా రామచంద్రయ్య యాదవ్ మాట్లాడితే దాన్ని వక్రీకరించి అభివృద్ధికి అన్నా రామచంద్రయ్య అడ్డుపడుతున్నారని తప్పుడు సంకేతాలు ప్రజలకు చేరేలా మీడియాలో మాట్లాడడం వైసిపి నాయకుల అవగాహన రాహిత్యానికి నిదర్శనం అన్నారు. జీవకోన ప్రజలకు మంచి రోడ్డు వస్తోందని అన్నా రామచంద్రయ్యకు చెందిన భూమిలో 15 అడుగులు రోడ్డుకు ఇచ్చారన్నారు. అత్యంత ప్రజాదరణ కలిగి న వ్యక్తిపై రాజకీయంగా బురద చల్లడానికే వైసిపి వారు ప్రయత్నిస్తు న్నా రన్నారు. వైసిపి నాయకులు చెప్పినట్టుగా అంత అభివృద్ధి తిరుపతిలో జరిగి ఉంటే కూటమి అభ్యర్థికి ఆరణి శ్రీనివాసులకు 62 వేల మేజారిటి ఎలా వచ్చిందని, అభివృద్ధి జరగని కారణంగానే వైసిపిని ప్రజలు పక్కనబెట్టారన్నారు. 'తిరుపతి టౌన్ బ్యాంక్ ఎన్నికల్లో ప్రజలు ఓటు వెయ్యనియ్యకుండా బయటి ప్రాంతాల నుంచి బస్సుల్లో జనాన్ని తీసుకోచ్చి ఓట్లు వేయించలేదా?' అని టిడిపి బిసి నాయకులు జగన్నాథం ప్రశ్నించారు. ఇకనైనా అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కోనంగి శ్రీరాములు, శేఖర్ యాదవ్, సుధాకర్, రామారావు, కోర్లగుంట ముని, చంద్రా యాదవ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు రఫీ హిందూస్తానీ

అన్ని సౌకర్యాలు సమకూర్చాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలో ప్రతి ఏటా నిర్వహించే ఏటి పండగ కార్యక్రమానికి వచ్చే వారికి అన్ని సౌకర్యాలు అందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏటి పండుగ పనులను సూళ్లూరు పేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బుధవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏటి పండగ ఉత్సవాలు నాయుడుపేట పట్టణంలో నిర్వహించే ఈ పండుగను నాయుడుపేట మండల ప్రజలే కాక చుట్టుపక్కల మండలాల ప్రజలు తిలకించేందుకు వస్తారన్నారు. సందర్శకులకు అన్ని సౌకర్యాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ, నెలవల రాజేష్ పాల్గొన్నారు.

నిందితురాలు అరెస్టు

ప్రజాశక్తి -నారాయణవనం: ఈ ఏడాది 1వ తేదీ నారాయణవనానికి చెందిన ఓ వృద్ధురాలి వద్ద వున్న బంగారు నగలు దొంగతనం కేసులో నిందితురాలిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నారాయణవనం ఎస్ఐ కే వి సురేంద్ర నాయుడు కథనం మేరకు.. నారాయణవనం మండలం, టౌన్ నవసంధు వీధిలో వుంటున్న సి జి. ఓసూరమ్మ (89) ఒంటరిగా వుంటోంది. అదే వీధిలో వుంటూ టిఫన్ అంగడి నిర్వహిస్తున్న మిట్టపాలెంకు చెందిన ఎం వల్లెమ్మ ఆమెతో స్నేహం చేసింది. వృద్ధురాలి వద్ద వున్న బంగారు నగలపై వల్లెమ్మ కన్ను పడింది. నగలు కాజేసేందుకు పథకం పన్నింది. ఈ నెల ఒకటో తేదీ ఓసూరమ్మ ఒంటరిగా వుండటం చూసి టిఫన్ తీసుకెళ్లి ఇచ్చింది. నెమ్మదిగా మాటలు కలిపి ఆమె తలపై బలంగా కొట్టింది. వెంటనే వృద్ధురాలు స్పృహ కోల్పోయింది. సమయం చూసి ఆమె ఇంట్లో వున్న 16 సవర్ల బంగారు నగలు అపహరించి పారిపోయింది. కొద్ది సేపటికి ఓసూరమ్మను గమనించిన స్థానికులు ఆమె బంధువులు సి పి అయ్యప్పన్ కు సమాచారం అందించారు. ఆయన ఓసూరమ్మను స్థానిక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చాడు. అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిఘా వేసిన పోలీసులు నిందితురాలు వల్లెమ్మను బుధవారం అరెస్టు చేశారు. పోలీసులను పుత్తూరు డిఎస్పి అభినందించారు.

చెరువులో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): మండలంలోని పనపాకం సమీపంలోని కోమటి వాని చెరువులో ఈతకు వెళ్లి ఓ యువకుడు గల్లంతైన సంఘటన బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కోమటివాని చెరువులోకి పనపాకం గ్రామానికి చెందిన విజయ్, కత్తి యోగేశ్, రాజేశ్ అనే ముగ్గురు యువకులు ఈతకు వెళ్లారు. వారిలో చెరువులోకి దిగిన విజయ్ నీటిలో మునిగి పోయాడు. మిగిలిన ఇద్దరు క్షేమంగా బయట పడ్డారు. వారు సహాయం కోసం కేకలు వేశారు. వారి కేకలు విని స్థానికులు పరుగు పరుగున చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో గాలిస్తూ పోలీసులకు సమాచారం అందించారు. చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చీకటి పడడంతో మృతదేహాన్ని వెలుపలికి తీయలేక పోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నగర పాలక సంస్థ పరిది లోని మూడవ వార్డు పోస్టల్ కాలనీలో ప్రజల ఫిర్యాదులను బుధవారం ఉదయం కమిషనర్ ఎన్. మౌర్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే సమస్యలను కమిషనర్ అధికారులతో కలసి పరిశీలిస్తున్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం పోస్టల్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. పారిశుధ్య పనులు వెంటనే చేపట్టాలని అన్నారు.

మహారాజశ్రీ తిరుపతి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
యస్.ఓ.పి.నెం. 05/2024

1) ఎ.లక్ష్మిదేవి భర్త ఆర్.బాబు
2) మైనరు బి.శరణ్య తండ్రి ఆర్.బాబు మైనరు తరుపున గార్డియన్ / తల్లి 1వ పిటిషనరు నివాసము డి.నెం.19-3-1సి/1డి, పి & టి కాలనీ, రేణిగుంట రోడ్డు తిరుపతి ...పిటిషనర్లు

Vs

యల్.ఐ.సి. ఆఫ్ ఇండియా, రాణిపేట బ్రాంచి, వేలూరు వారి తరపున బ్రాంచి మేనేజరు ...రెస్పాండెంట్

జనరల్ నోటీసులు

